# <u>విపరీత వ్యక్తులు</u>

## <u>పాత్రలు : వయసు</u>

1. సంజీవ్ (సైకియాట్రిస్ట్) : నలభైదాకా వుంటుంది.
(తెల్లకోటు వుండొచ్చు. స్టెతస్కోపు వుంటుంది.)

2. నారాయణ : 60 నుంటి అరవై ఐదు సంవత్సరాల వయస్సు.
అయినా స్ట్రాంగ్ గా ఉంటాడు.
పొట్ట మాత్రం బిగుతుగా, కొట్టొచ్చినట్లు వుంటుంది.
(అడ్డంగా చుట్టిన పంచె, చొక్కా)

3. మొగ్గ : 30 సంవత్సరాలు దాటాయి. మోడ్రన్ డ్రెస్లు వేస్తుంది.
హెయిర్ స్టయిల్ అంతే..
ఎక్కువగా చిన్న పిల్లలు మాట్లాడినట్లు మాట్లాడుతుంది.

4. అనుపమ్ : నల్లగా వుంటాడు. మరీ కారు నలుపు కాదు.
మంచి బట్టలు వేసుకుంటాడు.

# విపరీత వ్యక్తులు (నాటిక)

(డా. సంజీవ్, సైకియాట్రిస్ట్ అని నేమ్ ప్లేట్ టేబుల్ మీద వుంది. అది సంజీవ్ కన్సల్టేషన్ రూమ్. టేబుల్ ఎదురుగా ఓ కుర్చీ వుంది. ఆ గది గోడల మీద ఆ రంగంలో కృషి చేసిన వారి ఫోటోలు అతికించి వున్నాయి. అలాగే ఓ పక్కన అవకాశాన్ని బట్టి సోఫా గాని, రెండు మూడు కుర్చీలు వుంటాయి).
డాక్టర్ సంజీవ్ ఓ పుస్తకం చదువుతున్నాడు. అప్పుడు డోర్ బెల్ మోగిన శబ్దం. పుస్తకం టేబుల్ మీద పెట్టాడు. "కమిన్" అన్నాడు. అప్పుడు నారాయణ ఎంటరయ్యాడు. లుంగీ మీద రంగు వెలిసిన చొక్కా వుంది. అతని పొట్ట మాత్రం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.)

సం : ప్లీజ్ బీ సీటెడ్

నారా : అర్థం కాలేదండి....

సం : కూర్చోండి అంటున్నా....

నారా : నారాయణ...

అని జేబులో నుండి ఓ పేపర్ తీసి యిచ్చాడు.

అది మడతలు విప్పుతూ... నారా : నా బామ్మర్ది రాసిచ్చాడండి. ఆడు రివిన్యూలో పెద్ద ఆఫీసరండి. తమరికి బాగా తెలుసంట. మీ ఇద్దరూ కలిసి సదువుకున్నారంట కదా... ఆడి పేరు రవీంద్రబాబండి... నారాయణ...

సం : కూర్చోండి...

నారా : పెద్దాల్లముందు నిలబడి వుండాలండి. నారాయణ...

సం : మీ పేరు...

నారా : నారాయణండి...

సం : నారాయణ అనేది మీ ఊత పదమా...

పైకి చూస్తూ దండం పెట్టి... నారా : నారాయణంటే సాచ్చాత్తూ భగవంతుడు కదండి...

సం : మీరు నాకంటే పెద్దవారు నారాయణ గారు... రవి నాకు మంచి స్నేహితుడు. పెద్ద వాళ్ల ముందు కూర్చోగూడదంటే నేను నిలబడి మీతో మాట్లాడాలి...

నారా : అయబాబోయ్... ఆ పని సేయకండి. వయసు రాగానే పెద్దోళ్లమయి పోతాపేటండి... చెట్టుకి కూడా వయసొస్తదండి... నారాయణ..

నిట్టూర్చి... లెటర్ చదివాడు.

అది పుస్తకంలో పెట్టాడు. లేచి...

సం : ఇంతకూ మీ సమస్య ఏంటండి....

నారా : దానికి ముందు నేనో మాట తమరికి చెప్పాలండి... మీకు ఫీజు అదీ మా బామ్మర్ది ఇస్తాడండి. నాదగ్గర ఇంటికెళ్లటానికి సరిపడే డబ్బులు మాత్రం వున్నాయండి...

సం : చూడండి నారాయణగారూ... మిమ్మల్ని నేను ఫీజ్ అడగలేదు. మీ సమస్య అడుగుతున్నాను. ఇంక రెండవది మీరు మాట మాటకి నారాయణ అనకపోతే నేనే మీ ఇంటికి వెళ్లటానికి ఛార్జీలు ఇస్తాను.

ఆనందంగా... నారా : నిజంగానా... మా బామ్మర్ది చెప్పాడండి. డాక్టర్ గారు చాలా మంచాయన. నీ కడుపులో వున్న వన్నీ ఆయనకు సెప్పు అని. మరందుకే వచ్చాను. నన్ను అయినోల్లు కంట్లో నిప్పులు పోసుకుంటాడు అని ఆడిపోసుకుంటారండి...

సం : కంట్లో నిప్పులు పోసుకోవటం ఏంటండి. అవన్నీ సామెతలు... గిట్టని వారు ఏదొకటి అంటారు. అలాంటివన్నీ పట్టించుకోకూడదు. అసలు సమస్య చెప్పండి.

నారా : నాకు కడుపుబ్బరమండి...

అనగానే దగ్గరకొచ్చి పొట్టనొక్కి చూసాడు....

సం : స్ట్రాంగ్ గా వుంది. బహుశా గ్యాస్ ట్రబుల్ అనుకుంటాను. నాకు తెలిసిన ఇంకో డాక్టర్ వున్నాడు. ఈ లైన్లోనే వుంది హాస్పటల్. అక్కడ చూపించుకోండి.

నారా : అంటే నా బామ్మర్ది అమాయకుడంటారా... నారాయణ...

సం : నేను ఫీజు కోసం పంపించటం లేదు. లెటర్ రాసిస్తాను నారాయణ గారు...

నారా : అయ్యా... ఈ పొట్ట ఇరవై ఏళ్లుగా ఇట్టానే వుందండి. అది తగ్గదు. పెరగదు. కాకపోతే రెండేళ్ల నుండి ఆరోగ్గెం దెబ్బతినిపోయిందండి. మా బామ్మర్ది కంటి డాక్టర్కి చూపించాడు. కంట్లో చుక్కలేసుకొమ్మని రాసిచ్చేడు. గ్యాసు డాక్టర్ దగ్గర సూయించేడు. అరకు యిచ్చాడు. మందు బిళ్లలిచ్చాడు. కడుపులోకి గొట్టం పంపించేడు. నాకు తెలిసినంత వరకు నీ కడుపు కీన్ గా వుంది. నా వల్ల కాదని చేతులెత్తేసాడండి.

సం : అలాగా... అయితే మీ హిస్టరీ అంతా వినాలి... ఇలా నిలబడితే కాదు... మీరు కూర్చుంటే మనం తాపీగా మాట్లాడుకుందాం...

అంటుంటే 'మొగ్గ' వచ్చింది.

మొగ్గ : ఐ యామ్ సారీ డాక్టర్... గది బయట స్టూల్ వుంది. మీ అసిస్టెంట్ లేడు. అందుకని నేను మీ దగ్గరకు డైరెక్ట్ గా వచ్చాను.

సం : ఈ రోజు లీవ్ పెట్టాడు... మీరు...

మొగ్గ : మొగ్గ...

నారా : నారాయణ.. మొగ్గంట.. ఏం మొగ్గ తల్లీ.. మల్లె మొగ్గా, సంపెంగ మొగ్గా...

అటు చూసి చిరాగ్గా.... మొగ్గ : Who is this Old Man...

నారా : డాక్టర్ల దగ్గరికి ఎవరొస్తారమ్మా... రోగం వున్న వాళ్లు వస్తారు... నేను పేసెంట్ ని....

మొగ్గ : సారీ డాక్టర్... ఇక్కడ టోకెన్ సిస్టమ్ వుందా? ఈ పేషెంట్ తో మీరు మాట్లాడుతున్నారు. బాబాయి గారికి కోపం వచ్చింది.

నారా : నాకు కోపం రాలేదమ్మా... నేను మొగ్గని, కాయని, పండుని అంటుంటే అనుమానం వచ్చింది. అయినా ఈ పేర్లేంటి మొగ్గా... లోకంలో మీ అమ్మా బాబులకి పేర్లే దొరకలేదా!

సం : నారాయణ గారూ... ఇదేం బాగుండలేదు... మీ పేరు కూడా ఈ జనరేషన్కి నచ్చదు. అయినా వారు నాతో మాట్లాడుతున్నారు. మధ్యలో మీరు ఎందుకు కల్పించుకుంటున్నారు.

నారా : తప్పేనండి. నా పని చూసి నన్ను పంపించెయ్యండి...

సం : I am sorry... మీతో చాలా మాట్లాడాలి. అందుకని మీరు ఏదన్నా పనుంటే చూసుకుని రండి.

నారా : నాకు పనేం లేదండి... బయటికెల్తే చాయ్ తాగాలి. సిగరెట్ తగలెయ్యాలి...

సం : అదే పని చెయ్యండి...

నారా : డబ్బులు ఎవరిస్తారండి...

సం : మీ బామ్మర్ది ఇస్తాడు... అయినా కడుపు నిండా ఇన్ని సమస్యలు పెట్టుకుని ఈ టీలు... సిగరెట్లు ఏంటండి... అర్జెంట్ గా అవన్నీ మీరు మానేయ్యాలి...

మొగ్గ : బాబాయి గారు ఎడిక్ట్ అయినట్లున్నారు... మనీ నేను ఇస్తాను.

అని బ్యాగు నుండి తీసి ఓ ఏభై నోటు యిచ్చింది.

నారా : మీరు మాట్లాడుతుండండి. నేను వస్తాను.

అని వెళ్లాడు. సంజీవ్ ఆశ్చర్యంగా చూస్తుంటే....

మొగ్గ : ముసలివాళ్లు అంతే డాక్టర్... కొత్త పేర్లు భరించలేరు. కొత్త డ్రెస్లు వేసుకుంటే చూడలేరు. ఏదో కమెంట్స్ చేస్తుంటారు. ఇలాంటివారిని ఎమ్.సి.పి. లు అంటారు.

| | | | |
|---|---|---|---|
| అనగానే షాకయ్యాడు... | మొగ్గ | : | అదేనండి... మేల్ చ్యావనిస్ట్ పిగ్స్... |
| | సం | : | అయినా అలాంటి వారికి డబ్బులు ఎందుకిచ్చారు? పైగా బాబాయి అంటూ వరస కలిపారు. |
| | మొగ్గ | : | నేను మీతో పనుండి వచ్చాను. అందులోనూ ఆ ఓల్ట్ మాన్తో చాలా మాట్లాడాలన్నారు. అందుకని వదిలించుకున్నాను. |
| | సం | : | అలా అంటారా... మీరు టోకెన్ గురించి అడిగారు. మీరు ఎవర్నన్నా తీసుకువస్తున్నారా? |
| | మొగ్గ | : | నో.. నో... నేను మీతో మాట్లాడటానికి వచ్చాను. ఇఫ్ యూ డోంట్ మైండ్ ఓ సెల్ఫీ తీసుకుంటాను. |
| అని ఫోన్ తీసి... | మొగ్గ | : | ఛీజ్ |
| అని క్లిక్ చేసింది. | మొగ్గ | : | ఇప్పుడు ఇది ఫేస్ బుక్ లో పోస్ట్ చేస్తాను. నేను మీతో మాట్లాడటం పూర్తి అయ్యాక ఎన్ని లైక్ లు, ఎన్ని కామెంట్స్ వస్తాయో, ఎన్ని వాట్సప్ గ్రూప్స్ లో ఈ ఫోటో వైరల్ అవుతుందో మీకు చూపిస్తాను. |
| | సం | : | మొగ్గగారూ... నా దగ్గర కూడా స్మార్ట్ ఫోన్ వుంది... |
| | మొగ్గ | : | మీ నెంబర్ చెప్పండి... ఫోటో పంపిస్తాను. మొగ్గ విత్ డాక్టర్ సంజీవ్ అని బ్యూటిఫుల్ కాప్షన్ రాస్తాను. |
| | సం | : | ఓకే... ఓకే... ఇంతకూ మీరు ఎందుకు వచ్చారో తెలియదు. నేను డాక్టర్ అని తెలుసుకున్నారు. సంతోషం. కాకపోతే నేను సైకియాట్రిస్ట్ ని.... |
| | మొగ్గ | : | బయట బోర్డ్ వుంది. చదివాను... I want to write a పోయమ్... షార్ట్ స్టోరీ అండ్ ఏన్ ఆర్టికల్ ఆన్ యు డాక్టర్... |
| | సం | : | నా గురించి కథలు:కవిత్వం గట్రా రాస్తారా... అంటే మీరు రచయిత్రా, జర్నలిస్టా, పొయిట్రెస్సా... |
| | మొగ్గ | : | ఆల్ ఇన్ వన్... నన్ను ఎప్పుడూ పత్రికల్లో, మీడియాలో, ఫేస్ బుక్ లో, సోషల్ మీడియాలో మీరు చూడలేదా? |
| | సం | : | నేను డాక్టర్ ని మొగ్గగారూ... |
| | మొగ్గ | : | అయితే మీకు సమాజం గురించి అవసరం లేదా? స్మార్ట్ ఫోన్ ఎందుకు తీసుకున్నారు. ఇక్కడ వై ఫై ఎందుకు పెట్టించారు. యూటూ... |
| అంటుంటే... | సం | : | నా మిసెస్ కి మీరు తప్పకుండా తెలిసుంటారు. ఇవన్నీ తను ఫాలో అవుతుంది. |
| | మొగ్గ | : | మీరు పెళ్ళి చేసుకున్నారా! |
| | సం | : | మీరు చేసుకోలేదా? |

అప్పుడు బిగ్గరగా నవ్వుతుంటే....

సం : నాకు అర్థం అయింది...

అనగానే నవ్వు ఆపి... మొగ్గ : ఏం అర్థం అయింది...

సం : నేను అడక్కుండానే మీరు నా మీద ఆర్టికల్స్ రాయటం ఏమిటి అనుకున్నాను. మీకు ఏదో ప్రాబ్లమ్ వుంది. అది మాట్లాడటానికి వచ్చారు. ప్లీజ్ టేక్ యువర్ సీట్... వి విల్ డిస్కస్....

అని తన కుర్చీలో కూర్చున్నాడు.

అతన్ని చూస్తూ... మొగ్గ : నాకు ప్రాబ్లమా.... అంటే నాకు పెళ్లికాలేదు... లవ్ లో ఫెయిల్ అయ్యాను. అందుకని సూసైడ్ చేసుకోవాలనిపిస్తోంది. నన్ను ఈ ఫీలింగ్ నుండి బయటకు తీసుకురండి డాక్టర్ అని మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చానా....

సం : ముందు మీరు కూర్చోండి మొగ్గగారూ...

మొగ్గ : నాకు పెళ్లి కావాలంటే మేరేజ్ బ్యూరో దగ్గరికి వెళ్తాను. ఫేస్ బుక్ లో స్వయంవరం ప్రకటిస్తాను. నిజంగానే సైకియాట్రిస్ట్ దగ్గరకు వెళ్లాల్సి వస్తే మగవాడి దగ్గరకు రాను. ఫిమేల్ డాక్టర్స్ వున్నారు.

సం : మరేంటి మీ సమస్య... పోనీ మీరు వచ్చిన పని....

మొగ్గ : పెళ్లి అనేది ఓ చెత్త... ట్రాష్... య్యా.....

అని కూర్చుంది.

సం : పెళ్లి ట్రాషా.... పోన్లెండి. అయినా నేను ఇప్పుడు చేయగలిగింది లేదు. ఆల్రెడీ నాకు పెళ్లి జరిగిపోయింది.

లేచి.... మొగ్గ : మీ లాంటి వారిని చూసి మేం నవ్వుకుంటాం...

సం : మేం అంటే...

మొగ్గ : మాదో చిన్న సమూహం... అంటే గ్రూప్... అందరం కూర్చుంటాం. అందులో ఇద్దరు బీర్ తీసుకుంటారు. అఫ్కోర్స్ రెండు టిన్ బీర్లు... మూడోది పూర్తిగా అయితే మాటలు తడబడతాయి.

సం : మీరు కూడా పుచ్చుకుంటారా...

మొగ్గ : వైన్ తీసుకుంటాను.

సం : సంతోషం

మొగ్గ : అంతేనా... అక్కడ ఆగిపోయారా. స్మోకింగ్ ఈజ్ ఇంజూరియస్ టు హెల్త్.. కాన్సర్ వస్తుంది. డ్రింక్ చేస్తే ఆరోగ్యం పాడయిపోతుంది అని ప్రీచ్ చేయలేదు.

| | | | |
|---|---|---|---|
| | సం | : | ప్రీచ్ చేయటానికి నేను ప్రీచర్ని కాదు... డాక్టర్ని... మీరు ఎందుకు వచ్చారో ఇంత వరకు చెప్పలేదు. |
| | మొగ్గ | : | ఓ సారీ... మీరు పేషెంట్లతో మాట్లాడటానికి ఫీజు తీసుకుంటారు కదా. అదెంతో చెప్పండి. ఐ విల్ పే... |
| తను లేచి... | సం | : | నేను పేషెంట్ల దగ్గర ఫీజ్ తీసుకుంటాను. మీరు పేషెంట్ కాదు డాక్టర్ అని నాకు అర్థం అయింది. అందుకని మీరు నాకు ఫీజ్ చెల్లించనవసరం లేదు. వీలు కుదిరినప్పుడు మీకు ఫోన్ చేస్తాను. అప్పుడు వచ్చి పెళ్లి మీద, MCP ల మీద క్లాస్ తీసుకుందురుగాని : నారాయణ గారు ఎప్పుడయినా రావచ్చు. |
| | మొగ్గ | : | అంటే నన్ను దయచేయమంటారు. |
| | సం | : | అది మీ విచక్షణ మీద ఆధారపడుంటుంది. |
| | మొగ్గ | : | డాక్టర్ గారూ... రజని అని నా ఫ్రెండ్... మీ పేషెంట్... తను మీ దగ్గరికి వస్తే మీ సమస్యకి పెళ్లి అని ఓ టానిక్ రాసిచ్చారంట. అందుకని మీతో మాట్లాడటానికి వచ్చాను. మాటలకి ఖరీదు వుంటుంది కాబట్టి ఫీజు ఇస్తానన్నాను. |
| | సం | : | రజని గారు నా పేషెంట్... ఆమె ప్రాబ్లమ్స్ ఆమె చెప్పారు. నేను కౌన్సిలింగ్ చేస్తున్నాను. నచ్చితే వస్తారు. లేదంటే ఇంకో ఫిమేల్ డాక్టర్ దగ్గరికి వెళ్తారు. |
| | మొగ్గ | : | నేను కూడా కౌన్సిలింగ్ కోసమే వచ్చాను. అది నాకు కాదు. మీకు... ఫ్రీ గానే... |
| | సం | : | నేను మిమ్మల్ని అడగలేదు. మీ దగ్గరకి రాలేదు. మీరు ఇంక వెళ్లండి. |
| | మొగ్గ | : | ఫేస్ బుక్ లో కవిత్వం రాయమని ఎవరన్నా అడిగారా. అప్పుడే విచ్చుకుంటున్న పువ్వు, నీలాకాశంలో మబ్బులు తమని ఫోటోలు తియ్యమని డిమాండ్ చేసాయా? అది మన బాధ్యత. ఉదయం లేచింది మొదలు నిద్రపోయేవరకు నేనూ ఆన్ లైన్ లవర్స్ జనాన్ని ఎడ్యుకేట్ చేస్తాం. ఉల్లాస పరుస్తాం... నవ్విస్తాం.... కవ్విస్తాం... |
| అంటుంటే.... | సం | : | నారాయణ గారూ... రండి రండి... |
| అన్నాడు. వచ్చాక.... | నారా | : | ఏంటి డాక్టర్ గారూ... ఇంకా అవలేదా... |
| | సం | : | అయిపోయింది. మొగ్గగారు బయలుదేరుతున్నారు. |
| | మొగ్గ | : | నేను వెళ్లటం లేదు. |
| | నారా | : | అంటే నన్ను మళ్లీ బయటకు వెళ్లమంటారా? |

సం : అవసరం లేదు.

నారా : అయ్యా... నా చిన్నప్పటి సంగతి ఒకటి తమరికి చెప్పాలండి...

సం : ఏంటి నారాయణ గారూ...

నారా : మా నాన్నకి మంగలి రాందాసు ఫ్రెండండి. అక్కడే తల గొరిగించుకొమ్మని నన్ను పంపేవాడు. డబ్బులు మాత్రం యిచ్చేవాడు కాదండి. రాందాసుకీ మా నాయనకి ఏవో లెక్కలున్నాయి. రాందాసు కాస్త మందు పుచ్చుకునేవాడు. అందుకని పెద్ద మనుషులు ఆయన దగ్గరికి వచ్చేవారు కాదండి.

మొగ్గ : ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్... కానీయండి....

నారా : పసిమొగ్గా : నీకు ఇంట్రెస్టే... నాకు నరకం... మా రాందాసు పిల్లితల గొరిగే బాపతండి. నా తల మీద కత్తిరెట్టి సగం డిప్పకటింగ్ చేసేవాడు. దాన్ని మూకుడు అనేవాళ్లు నా దోస్తు గాళ్లు... ఇప్పుడది పేసనండి.

సం : మీరిట్టా కథలు చెబితే ఎట్లా నారాయణ గారూ... ఇది హాస్పటల్...

నారా : ఇక్కడుంది ఇద్దరు పేషంట్లే కదండి... సొంతం యినాలమరి. సగం పని సేయగానే ఎవడో గడ్డం మాసినోడు వచ్చేవాడు. నన్ను పక్కన కూకోరా నారాయణ అనేవాడు. రాందాసు మిగతా సగం ఎప్పుడు సేస్తాడో తెలియదు.

సం : ఇంతకీ ఇదెందుకు చెప్పావు.

నారా : ముందొచ్చింది నేనండి. తర్వాతొచ్చింది మొగ్గండి... మరి తమరు మా రాందాసులాగా...

మొగ్గ : అప్పుడు మీరు ఫోటోలు తీయించుకున్నారా... మీ దగ్గరుంటే ఇవ్వండి... స్కానింగ్ చేసి ఫేస్ బుక్ లో పెడతాను...

నారా : ఎక్కడ పెడతావమ్మా...

మొగ్గ : ఫేస్ బుక్కులో...

నారా : మా బామ్మర్ది దగ్గర పెద్ద ఫోనుంది అమ్మా... అందులో ఇరవై గంటలూ మాట్లాడతాడు. ఎప్పుడూ నొక్కుతుంటాడు. ఆడేలూ, చెవి కూడా మొరాయిస్తాయి.

సం : మొగ్గగారూ... నేను మీకు పది నిముషాలు మాత్రం ఇస్తాను. ఈలోగా నారాయణ గారు ఇంకోసారి టీ తాగి వస్తారు...

మొగ్గ : అవసరం లేదు. ఆయన ఇక్కడే వుంటారు. కౌన్సిలింగ్ ఆయనకీ అవసరం. పెళ్లి అంటే చెత్త. అది మగవాడి అహంకార కేంద్రం. అయినా పెళ్లిలో ప్రేమకు స్థానం లేదు. అందుకే కొత్తతరం పెళ్లిని నిషేధిస్తోంది.

నారా : అమ్మాయి మొగ్గా... మా వూర్లో ఓ అమ్మాయి వుంది. పెళ్లి చేసుకుంటాను మొర్రో అన్నా ఒక్కళ్లూ రెడీ అనలేదు. ఇప్పటికి పైన్ తీసూ... అంటే ముప్పై అయిదు...

మొగ్గ : కట్నం తీసుకునే మగ పందులు పెళ్లి ఎందుకు చేసుకుంటారు?

నారా : పందుల్లో ఆడ మగా వుంటాయి మొగ్గా... మా వూళ్లో ఇప్పటికి పది మంది కుర్రాళ్లున్నారు. 30 దాటినాల్లే... పొలాలున్నాయి... యాపారాలున్నాయి. ఆడపిల్లలు దొరకటంలా... దొరికినా అమెరికా వాడు కావాలంట...

మొగ్గ : అసలు ఆడపిల్లల్ని మీరు బతకనిస్తే కదా... అందుకే మగాళ్లూ చావండి. ఉన్న ఆడాళ్లు కూడా పెళ్ళిళ్లు చేసుకోరు...

నారా : ఇది అడగటానికి వచ్చావా... పోనీ ఓ పని చెయ్యండి. ఇక నుండి మగపిల్లాడు అని తెలవగానే చంపేయండి. బాకీ తీరిపొద్ది.

సం : నారాయణ గారూ...

నారా : అయ్యా... ఇంతకీ అమ్మాయి పెళ్లి వద్దు అంటోంది. ఇప్పుడు పెళ్లి చేసుకున్న వారి సంగతేంటి...

మొగ్గ : పెటాకులే... అందరూ కుటుంబాల నుండి బయటకు రావాలి.

నారా : బాగానే వస్తున్నారులే మొగ్గా... నాకు తెలవక అడుగుతా... ఆడా:మగా లేకండా బతుకెట్టా వుంటదమ్మాయి.

మొగ్గ : మేం పెళ్లి వద్దంటున్నాం. కలిసి బతకటాన్ని కాదు. నచ్చినవాడితో నచ్చినంత కాలం కలిసుంటాం. నచ్చని రోజున జావో.. జావో అంటాం....

నారా : అట్టాగా... బాగుందమ్మాయి. నేను పెద్దగా సదువుకోలేదు గాని ఓ మాట ఇను... నువ్వు మరీ మొగ్గవి కాదు. అయినా వయసులో వున్నావు. నా వయసు వచ్చేసరికి నీలాంటోల్ల ముకం చూసేవారుండరు. ఆడయినా మొగైనా అప్పుడందరూ భాగో నే....

మొగ్గ : బాబాయి గారూ మీలాంటి వారందరూ ఔట్ డేటెడ్... అందుకే ఇప్పుడు ఆడవాళ్లని ఆడవాళ్ళు... మగవాళ్ళని మగవాళ్లు చేసుకుంటున్నారు...

నారా : మరి పిల్లలు ఎట్టా పుడతారు...

మొగ్గ : పిల్లలకి కొదవా బాబాయి. టెస్ట్ ట్యూబుల్లో పెంచుతారు....

నారా : మొక్కల్లానా... సరేకానియ్యండి... ఎవరి పిచ్చి ఆళ్లకి ఆనందం...

మొగ్గ : ఇది పిచ్చికాదు. ప్రయోగం. ఈ మగ ప్రపంచాన్ని సమూలంగా మార్చేయాలి. వాళ్ల అహంకారాన్ని బద్దలు కొట్టాలి. అప్పటిదాకా ఈ పోరాటం ఆగదు... ఆగదు...

సం : చాలు... ఇంక ఇద్దరూ మాట్లాడొద్దు. నేను హాస్పటల్ క్లోజ్ చేస్తున్నాను. అందరం బయటకి నడుద్దాం.

నారా : మళ్లీ రేపు రావాలంటే కష్టం. బస్ ఛార్జీలూ, టీలూ, సిగరెట్లు అన్నీ ఖర్చులే...

సం : మీ బామ్మర్ది రవీంద్ర ఇస్తాడు. ఇంక ఒక్క క్షణం ఇక్కడ వుండను.

మొగ్గ : అవసరం లేదు డాక్టర్... మీరు వాదానికి నిలబడ లేరని నాకు అర్థం అయింది. మీ వ్యాపారం చెడగొట్టటం నాకు ఇష్టం లేదు. అందుకని నేను వెళ్తాను. ఈ మనిషి నన్ను శాపనార్థాలు పెడతాడు. మళ్లీ తీరిగ్గా కలుస్తాను. బై బాబాయి...

నారా : నేను కూడా బయటదాకా వస్తానమ్మాయి... అయ్యా డాక్టర్ గారూ పది నిముషాల్లో వస్తాను...

అని... నారా : పదమ్మాయి.

అని వెళ్లారు ఇద్దరూ...

సంజీవ్ జుట్టు పీక్కున్నాడు.

తర్వాత సెల్ తీసి చేసాడు..

సం : రవీంద్రా... నేను సంజీవ్ ని మాట్లాడుతున్నాను. ఆ.... మీ బావగారు వచ్చారు. ఓ నమూనా అనుకో... మన చిన్నప్పుడు ఎన్.డి.యస్ మాస్టారు అనే వారు. వీడో నమూనా అని...

నవ్వు వినిపించింది.... : ఇంతకీ మీ బావగారు ఏం చేస్తారు?

రవి (వా) : ఏమీ చెయ్యడు. రెండెకరాల భూమి వుంటే అమ్మి బ్యాంక్ లో వేసాడు. వడ్డీ వాడుకుంటాడు. ఇంట్లో మా అక్క, ఆయనే వుంటారు. గొప్ప మాటకారి.

సం : అది తెలుస్తూనే వుంది. ఇతనికి వైద్యం అవసరమా?

రవి (వా) : మామూలుగా అయితే అందరి మీద వాలిపోతుంటాడు. నా పేరు చెప్పుకుని అక్కడ కొంత మందికి పనులు చేయిస్తానని చిలక్కొట్టుడు కొడతాడు.

సం : ఏదన్నా పెద్ద ఇష్యూలో నిన్ను యిరికిస్తాడేమో చూసుకో...

రవి (వా) : అంత లేదులే... అయినా నేనంటే భయం. అది సరే... నీ ప్రాక్టీస్ ఎలా వుంది?

సం : ఏం ప్రాక్టీసో.. ఈ రోజు ఆయనా... మొగ్గ అని ఇంకో ఫెమినిస్ట్ వచ్చారు. లీటరల్గా మెదడు తినేసారు. ఇప్పుడనుకుంటున్నా అనవసరంగా సైకియాట్రిస్ట్ని అయ్యాను ఆర్.ఎం.పి. డాక్టర్ నైనా ఇంత హింస వుండదు.

నవ్వు వినిపించింది.

సం : నిజం చెబుతున్నాను. ఏదన్నా వ్యాపారం చేసుకుంటే బాగుండేలా వుంది.

రవి (వా) : మా బావ వున్నాడా? వెళ్లిపోయాడా?

సం : బయటకు వెళ్లాడు. ఇంతవరకు ఆయన సమస్య చెప్పలేదు.

రవి (వా) : అన్నీ చెప్పమన్నాను సంజీవ్... ఎలాంటి మొహమాటం లేకుండా మాట్లాడు. ఇంట్లో అక్క ప్రాణం తీస్తున్నాడు... ఆ రోగం.. ఈ రోగం అని. గట్టిగా చెప్పకపోతే వినడు...

సం : పిల్లలు లేరా?

రవి (వా) : దూరంగా వున్నారు. ఈయన్ని భరించటం కష్టం అని దగ్గరకు రానీయరు...

సం : సరే... నాకు మా ఆవిడ ఫోన్ చేస్తోంది. నేను నారాయణ గారికి షాక్ ట్రీట్ మెంట్ ఇస్తాను. ఉంటా...

అని ఫోన్ కట్ చేసాడు.

మళ్లీ ఫోన్ చేసాడు. సం : లక్ష్మీ... నేను బిజీగా వున్నాను. మొగ్గ అనే ఫెమినిస్ట్.. రైటర్ నీకు తెలుసా... అయితే ఆమె వివరాలు నాకు వాట్సప్ చెయ్యి. ఉంటా...

అని ఫోన్ కట్ చేసాడు.

అప్పుడు నారాయణ వచ్చాడు...

నారా : డాక్టర్ గారూ... మా బామ్మర్దికి నా మీద కంప్లయింట్ చేసారా?

సం : మీవి పాము చెవులా?

నారా : పాముకి కళ్లుంటాయి గాని చెవులుండవండి. అందుకే మనుషులు కనపడగానే కసుక్కున కాటేస్తాయి.

సం : మీకు చాలా విషయాలు తెలుసే...

నారా : సదువు తక్కువయింది కదండి...

సం : అదే మంచిది లెండి. మీకు చదువెక్కువయితే ప్రపంచానికి పిచ్చి ఎక్కేది.

అని... సం : మొగ్గగారు వెళ్లిపోయారా...

| | | | |
|---|---|---|---|
| | నారా | : | వాకిట్లో వున్నారండి... |
| షాక్ తో... | సం | : | నిజమా...? |
| | నారా | : | అంత ఉలిక్కిపడ్డారేంటి? నేను దగ్గరుండి కారు ఎక్కించి వచ్చా... |
| | సం | : | ఆవిడకి కారు కూడా వుందా? |
| | నారా | : | డయివర్ కూడా వున్నాడు... రిచ్చే.... |
| | సం | : | అయినా ఆవిడెనకాల మీరు ఎందుకు వెళ్లారు? |
| | నారా | : | పెళ్లీ పెటాకులు వద్దు, నచ్చితే అదేదో అంది కదండి... కలిసి బతకటానికి ఆవో... ఆవో అంటారని... |
| | సం | : | ఆశకు అంతుండాలి. అయినా మీ వయసేంటి... మీ పొట్ట ఏంటి – మగ పందులు అని తిట్టమంటే తిట్టరా... నీ గురించి రవీంద్రకి చెప్పాల్సిందే.... |
| | నారా | : | నారాయణ.... నారాయణ... మొగ్గతో ఆవో ఆవో కాదండి... రాలిపోయే పూలుంటే వాసన చూద్దారని... |
| | సం | : | ఛ... వూర్కోండి... అసలు మీ జబ్బు ఏంటో ఇప్పుడు తెలిసింది. ఇంట్లో భార్య వుంది. పిల్లలున్నారు. కడుపు నిండా రోగాలున్నాయి. వాసనలు చూస్తారా... సిగ్గుండాలి. డాక్టర్ ముందు ఇలాంటి మాటలు మాట్లాడతారా... |
| | నారా | : | అయబాబోయ్... మీకు నిజంగానే కోపం వచ్చింది. లెంపలేసుకుంటున్నా... మా బామ్మర్దికి చెబితే నా కొంప కొల్లేరవుద్ది... నాకు ఎప్పుడేం మాట్టాడాలో తెలియదని బామ్మర్ది తిడతాడండి. నవ్వు కుంటానికన్నాను. |
| | సం | : | మనసులో అలాంటి ఆలోచనలుంటేనే ఇలాంటి మాటలు వస్తాయి. |
| | నారా | : | నన్ను వొగ్గేయండి మహా ప్రభో... ముందు నాకీ రోగం తగ్గించండి... |
| | సం | : | ముందు కూర్చుని మీ ప్రాబ్లమ్ చెప్పండి... |
| | నారా | : | కూర్చుంటే మాట్లాడలేనండి... యిబ్బందిగా వుంటుంది. అటూ ఇటూ తిరుగుతూ మాట్లాడతాను. ఈ మధ్య తిన్నది అరగటం లేదు. |
| | సం | : | మీ ఇష్టం... మొదలుపెట్టండి. |
| | నారా | : | మీరు నా స్వంత మనిషనుకుని నా కడుపులో వున్నది మీకు సెప్పుకుంటున్నా... మా బామ్మర్దికి కూడా ఈ సంగతులు చెప్పనని నా మీద మీరు వొట్టేయాలి... |

సం : ఈ వొట్టేంటండి నాన్సెన్స్... అయినా డాక్టర్లు రోగి గురించిన విషయాలన్నీ సీక్రెట్ గా వుంచుతారు. అది మా బాధ్యత. ఇంకా నయం నా మీదే ఒట్టు వేయమనలేదు.

నారా : అంతమాట అనీసీకండి... మీరు నాలుగు కాలాల పాటు బతకాలి. నాలాంటోల్ల రోగాలు తగ్గించాలి. మడిసన్నాక మనసులో మాటల్ని దాయటం కస్టం. అది ఆడోల్లకంటారు గానీ మగాల్లకీ కస్టమే...

సం : ఇలా అయితే కష్టం... మీరు ఇంటికి వెళ్లండి...

నారా : నా మాట ఇనండి... మనోల్లు ఇక్కడ సంపాయించిన డబ్బుల్ని అదేదో దేశంలో, అదేదో బ్యాంకులో దాచుకుంటారంట కదండి...

సం : అవును.. స్విస్ బ్యాంకుల్లో

నారా : ఆల్లని ఎవరు చంపుతానన్నా రహస్యం చెప్పరంట కదండి...

సం : అయితే...

నారా : మరి ఆల్లు కూడా ఈ మద్దెన సెప్పేత్తన్నారంట కదండి...

తలపట్టుకున్నాడు.... నారా : డాకటరు బాబూ... నేను అంత గొప్పోడ్ని కాదు గాని... మా బామ్మర్దికి సెప్పకుండా వుంటే చాలు...

సం : అలాగే... అందుకు నేను ఒట్టు వేయను. చెబితే చెప్పండి.. లేదా మీ దగ్గరే దాచుకోండి.. డాక్టర్ దగ్గర రోగం దాచేవాడే ఛస్తాడు.

అని కుర్చీలో కూర్చున్నాడు.

నారా : మరి చావనా... మిమ్మల్ని నమ్మాను. యినండి.

అని... నారా : మా బామ్మర్దిగాడికి ఇద్దరు అక్కలు, ఓ సెల్లీ వున్నారండి. ఆడు చిన్నపిల్లాడిగా వున్నప్పుడు నాకు పెళ్లి అయింది. అప్పుడు నాకో ఎకరం యిచ్చారు.

సం : బాగా యిచ్చారు. అసలు మీకు పిల్లని ఇవ్వటమే ఎక్కువ....

నారా : లోకులు అట్టానే అంటారండి... అప్పుడు మా పెద్ద బామ్మర్ది బతికుండేవాడు. ఇప్పుడు లేడండి... చిన్న బామ్మర్ది గాడు ఇంత పెద్దాడవుతాడని నాకు తెల్దుకదండి. అందుకని చిన్నచూపు చూసాను.

సం : అది మనసులో పెట్టుకుంటే నిన్ను నా దగ్గరికి ఎందుకు పంపిస్తాడు?

నారా : అది నిజమేగాని... మా ఆడాళ్లు ఆడికి రెండో అక్కండి. మొదటక్క కూతుర్ని ఈడు చేసుకున్నాడండి.

సం : మీకు అమ్మాయుందా?

నారా : వుంది గాని... అప్పుడీడికి ఉద్యోగం లేదండి... అందుకని నా కూతుర్ని ఇమ్మన్నా ఇచ్చి వుండేవాడ్ని కాదండి...

సం : మీరు ఇప్పుడు నిజాయితీగా మాట్లాడారు.

నారా : పెద్దక్కకి ఈడి అవసరం లేదండి. రెండో అక్కకి అంటే ఆడి బావనయిన నాకు వుందండి... అయితే ఆడికి సెల్లెంటే పాణమండి... ఏం చేసినా ఆ పిల్లకే చేస్తాడు.

సం : అదా మీ కడుపుబ్బరం. అయినా మీ మరదలే గదా...

నారా : భలేవారండి... ఏతిత్తి కాతిత్తి అంటారు. నీకు కట్నం యిచ్చాం అంటాడండి. యిస్తే ఇంకో సారి ఇవ్వకూడదండి. నేను ఎకరం ఇమ్మని అడగను... రెండొందల గజం స్థలం ఇస్తే నేను నా తంటాలు పడి ఇల్లు కట్టించుకుంటాను కదండి....

సం : గవర్నమెంట్ భూమి రాసివ్వమంటారా?

నారా : ఆడికి పొలముందండి... అందులో రెండు వందలండి... నాలుగుసెంట్లు... చెల్లికి అరెకరం యిస్తాడంట....

సం : అదెవరు చెప్పారు?

నారా : పేర్లు సెబుతారేంటండి... అక్క చెల్లి ఇద్దరూ ఓ తల్లికే పుట్టారు. అక్కడ తేడాలు సూయించకూడదు కదండి. నాయం మీరు సెప్పాలి.

సం : అలాంటివి కోర్టువారు చెబుతారు. ఇదేనా మీ జబ్బు... అదే కడుపుబ్బరం...

నారా : అదొకటే కాదండి... సిన్నప్పటి నుంచి ఎవరన్నా బాగుపడుతున్నారని తెలిస్తే కడుపు మంటగా వుండేది...

సం : అందుకా కళ్లల్లో నిప్పులు పోసుకుంటాడని అనేది...

నారా : ఇయ్యన్నీ బయటకు చెప్పనండి. తమరికి సెప్పుకుంటున్నా.... అది మొదలండి... చెట్టు పచ్చగా కనిపిస్తన్నాయనుకోండి. లోపల్నుంచి బాధండి... ఎవడన్నా కడుపు నిండా భోజనం తింటన్నాడనుకోండి. అది చూస్తే కడుపుబ్బరం... చివరకి ఆకాశంలో మబ్బులు కనిపిస్తున్నాయనుకోండి. సేమ్ టూ సేమ్....

సం : నిజమా... అంటే మీకు బామ్మర్ది మీదే కాదు, మరదలు కుటుంబం మీదే కదు, చెట్లని చూసినా, మబ్బుల్ని చూసినా బాధేనా... మరి పిల్లల్ని చూస్తే....

నారా : ఆల్లు నవ్వుతుంటే నేను తట్టుకోలేనండి...

సం : ఇంకో అనుమానం... మీ ఆవిడ, మీ పిల్లలు, వాళ్ల పిల్లలు, వాళ్లని చూస్తే ఏమనిపిస్తుంది.

నారా : నాకు నవ్వే వాళ్లను చూస్తే మంట. ఏడిచే వాళ్లను చూస్తే ఆనందమండి.

సం : పోస్లే వాళ్లు అదృష్టవంతులు...

నారా : అక్కడిదాకా ఎందుకండి... మిమ్మల్ని చూసినా, మీ ఆసుపత్రిలో పది మంది పేసెంట్లు కనిపించినా ఏంటోగా వుంటుంది. దీన్నేమంటారండి రోగమా... జబ్బా.... ఇంకోటా?

సం : నారాయణ గారూ... ఇంతవరకు నా దగ్గరకు ఇలాంటి కేసు రాలేదు... ఇది మొదటి సారి. మీ బామ్మర్ది మీదో ఇంకొకరి మీదో కడుపు మంట అంటే అదో విషయం. మీకు నాలుగు సెంట్లు కాదు. ఓ ఎకరం రాస్తాడు. అంతటితో మీ సమస్య సాల్వ్ కాదు. మీరు ఈ ప్రపంచంలో బతకటానికి పనికిరారు... ప్రపంచంలో అడుగడుగునా మనుషులుంటారు కదా...

నారా : పోనీ అడవులకు యెళ్లాలంటారా?

సం : అడవులనిండా పచ్చటి చెట్లు వుంటాయి. దుప్పులుంటాయి. పులులూ, సింహాలుంటాయి. వాటిని చూసినా మీకు కడుపుమంటగా వుంటుంది. పోనీ సముద్రం పక్కన పడేద్దామన్నా ఆ అలలు ఆగవు. షిప్పులుంటాయి... చేపలుంటాయి... తిమింగలాలు, ముత్యాలుంటాయి. అక్కడా కష్టం... కాకపోతే ఒకటే కాస్త రిలీఫ్....

నారా : అదేంటయ్యా...

సం : మీరు కళ్లల్లో నిప్పులు పోసుకుంటారని ఎవరు అన్నారో తెలియదు. మీ కళ్లకి చూసిందాన్నల్లా మాడ్చేయగల శక్తి మాత్రం రాలేదు. లేకపోతే ఈ పాటికి యుగాంతం అయివుండేది.

నారా : అయితే నా రోగానికి మందే లేదంటారా....

సం : అది నేను స్పెషలిస్టు డాక్టర్లతో డిస్కస్ చేయాలి. ఓ సారి మిమ్మల్ని హిప్నటైజ్ చేసి మీ మెదడులో ఇంకెన్ని ఇలాంటి ఆలోచనలున్నాయో తెలుసుకుంటే గాని ఏమీ చెయ్యలేను.

నారా : ఇది పిచ్చి అంటారా?

సం : అంటే నువ్వు వూరుకుంటావా... ముందయితే మీకు షాక్ ట్రీట్ మెంట్ ఇవ్వాలి.

నారా : అంటే ఏంటి?

సం : కరెంట్ షాక్స్ ఇవ్వాలి...

నారా : చచ్చిపోతాను కదండి...

సం : అంత హై వోల్టేజ్ లో ఇవ్వం.. మీరు చావటం కాదు... మీ మనసులో వున్న ఇలాంటి ఆలోచనలు చావాలి...

నారా : అయ్యా నాకు ఏ ట్రీట్ మెంటూ వద్దు. కల్లో, గంజో తాగి బతుకుతాను. ఏదో రోజు అందరం పోవాల్సిందే కదా...

సం : మీరు కంగారు పడకండి... నేను రవీంద్రతో మీ సమస్య గురించి మాట్లాడతాను.

నారా : ఇంతకు ముందు ఎవరికీ చెప్పను... ముఖ్యంగా మీ బామ్మర్దికి అన్నారు...

సం : మరి మీట్రీట్ మెంట్ కి డబ్బులు ఎవరిస్తారు. మీరు మీ బాంకులో వున్న డబ్బులు బయటకు తీస్తారా?

నారా : అయి తీస్తే నాకు కడుపుబ్బరం తగ్గుద్దా... ఏదొకటి చెయ్యండి నారాయణా....

సం : ఇంక మీరు బయలు దేరతారా....

నారా : అయ్యా... నా జబ్బు నాకు తెలిసింది.. ఆ మొగ్గకి కూడా రోగమేనా...

సం : అలాంటివి చెప్పకూడదు... డాక్టర్లు రహస్యాలు చెప్పరు...

నారా : మంచిది. మీరు భోజనం ఇక్కడ చేస్తారా... ఇంటి దగ్గరా...

సం : ఇంటి దగ్గరే... అయినా ఇప్పుడు చేయను. మీకు నేను ఛార్జీలు కూడా ఇవ్వను. ఎందుకంటే ఇంత వరకు ఫీజు యిచ్చిన పేషెంట్లు రాలేదు.

తలూపి బయటకు వెళ్లాడు...

సం : అమ్మయ్యా... ఈ రోజు ఇంత హారిబుల్ గా వుందేంటి?

అనుకుని ఫోన్ చూస్తున్నాడు.

అలా కొద్ది క్షణాలు చూసాక

ఫోన్ రింగయింది.

సం : ఏంటి లక్ష్మీ... ఇప్పుడే నువ్వు పంపించిన మొగ్గ వివరాలు చదువుతున్నాను. ఉదయం మన హాస్పటల్ కి వచ్చింది. ఎవరన్నా పేషెంట్ ని తీసుకురావాలనుకుందేమో అనుకున్నాను. నాకు కౌన్సిలింగ్ చేయటానికి అనుకోలేదు.

లక్ష్మీ వాయిస్ : ఏంటంట ఆవిడ గారి కౌన్సిలింగ్...

సం : దేశంలో ఎవరూ పెళ్లి చేసుకోకూడదంట. చేసుకున్నా వెంటనే బయటకు రావాలంట....

లక్ష్మి(వా): ఇంతకు ముందు సభలు పెట్టి చెప్పేవారు. ఇప్పుడు ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారా. అయినా ఆవిడ్ని గాని ఇంకొకర్ని గాని పెళ్లి చేసుకో అని ఎవరూ డిమాండ్ చేయటం లేదు కదా....

సం : ఇంతకు ముందు రజని అని వాళ్ల ఫ్రెండ్ మన హాస్పటల్ కి ట్రీట్ మెంట్ కోసం వచ్చింది... ఆ అమ్మాయి చెప్పిన మాటలు మొగ్గకి చెబితే ఏమనేదో... ఎదుటి వారిని మాట్లాడనివ్వదు. అయినా ఆడపిల్ల... అందులోనూ ఫెమినిస్ట్... ఎంతకూ తన గోల తప్పితే ఇతరులకు అవకాశం ఇవ్వదు.

లక్ష్మి (వా): నేను కూడా ఫెమినిస్ట్ నే... నాకూ మగాళ్ల మీద కోపం వుంది. మీ మీద కూడా వుంది.

నిశ్శబ్దం

లక్ష్మి (వా): అయినా మిమ్మల్ని విడిచిపెట్టి బయటకి వెళ్లాలని లేదు. నేనే కాదు. ఇంకా పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని మగవాళ్లని మార్చటానికి పోరాటాలు చేస్తున్న చాలా మందున్నారు. ఈవిడ మాత్రమే వీర ఫెమినిస్ట్ అనుకుంటోంది.

సం : అప్పటికీ చెప్పాను. నాకు తీరిక వున్నప్పుడు మీకు ఫోన్ చేస్తాను. అప్పుడు మీరు చెప్పే మాటలు వింటాను అని....

లక్ష్మి(వా): ఈ సారి వస్తే నా పేరు చెప్పండి. నాతో మాట్లాడమనండి. అయినా ఇదొక మానియా. తెల్లారి లేచిందగ్గర్నుంచి ఐడెంటిటీ క్రైసిస్, ఫేస్ బుక్ లోనూ, వాట్సపుల్లో వాంతులు చేసుకోవటం. వాళ్ల స్వేచ్ఛను ఎవరూ కాదనటం లేదు. అదే స్వేచ్ఛ అందరికీ వుంటుందని ఒప్పుకోరు. యుద్ధం అంటూ జరిగితే మగవాళ్ల మీద, అహంకారం వున్న ఆడవాళ్ల మీద ఏక కాలంలో జరగాలి.

సం : నేను ఇంటికి వచ్చాక మాట్లాడుకుందాం లక్ష్మి...

లక్ష్మి(వా): మామూలుగా ఇలా పని చేసేవారికి ఓ ఎజెండా వుంటుంది. ఈవిడ గారికి ప్రచారమే ఓ ఎజెండా... అయినా అంటుంటారు కదా. దీసీజే మేడ్ మేడే వరల్డ్ అని... లోకం అలా తయారవుతోంది. నేను ఆఫీస్ అవగానే వస్తాను.... బై....

సం : బై....

అని కట్ చేసాడు.

అప్పుడు ఆ గదిలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

అను : లోపలకు రావచ్చా...

| | | | |
|---|---|---|---|
| అని వినిపించింది.. | సం | : | రండి... |
| అనగానే వచ్చాడు. | అను | : | నా పేరు అనుపమ్. |
| | సం | : | గుడ్ నేమ్... రండి... మాట్లాడుకుందాం... |
| అని కదలబోయాడు. | అను | : | ఒక్క నిముషం డాక్టర్... |
| ఆగాడు... | అను | : | నేను ఓ సీరియస్ విషయం మీతో మాట్లాడటానికి వచ్చాను. అవతల తలుపులు తెరిచి వున్నాయి. బయట వున్న వాళ్లకి మన మాటలు వినిపిస్తాయి. అది చాలా ప్రమాదం. |
| | సం | : | అంత పెద్దగా మాట్లాడం. ఇది బహిరంగ సభ కాదు కదా... |
| | అను | : | నన్ను అర్థం చేసుకోండి... చిన్న రిస్క్ తీసుకోవటం కూడా నాకు ఇష్టం లేదు. ఇప్పటికే నేను అతి పెద్ద రిస్క్ తీసుకున్నాను. |
| | సం | : | అదేంటో తెలుసుకోవచ్చా? |
| | అను | : | పెళ్లి |
| షాత్ తో చూస్తున్నాడు... | అను | : | ఏంటి డాక్టర్ అలా అయిపోయారు. మీరు కూడా అలాంటి రిస్క్ తీసుకున్నారా? |
| | సం | : | పెళ్ళి రిస్క్ ఏంటి అనుపమ్ గారూ... అది నూరేళ్ల పంట. |
| | అను | : | నేను కూడా ఈ సినిమా పాటలు విని మోసపోయాను. మనం మనుషులు లేని చోట సీక్రెట్ గా మాట్లాడుకోవాలి. అందుకని మీరు హాస్పటల్ క్లోజ్ చేసి నాతో రావాలి... |
| | సం | : | పేషెంట్లు వస్తారు. |
| | అను | : | ఎంత మంది వస్తారు. నలుగురా... అయిదుగురా... ఆ ఫీజ్ లన్నీ కలిపి ఇస్తాను. |
| | సం | : | సంతోషం. అయినా హాస్పటల్ అంటే ఓ డీసెన్సీ వుండాలి. ఎప్పుడు బడితే అప్పుడు ఓపెన్ చేయటం, క్లోజ్ చేయటం జరగకూడదు. మీరు అంటారు అర్జెన్సీ వచ్చినప్పుడని... ఈ రోజు మా అసిస్టెంట్ లీవ్. అతనుంటే సమాధానం చెప్పేవాడు. మీరు రేపు రండి... |

అతను అటూ ఇటూ తిరిగుతున్నాడు...

| | | | |
|---|---|---|---|
| ఆగి... | అను | : | కనీసం డోర్స్ క్లోజ్ చేద్దామా... |
| | సం | : | అంత సీక్రెటా... మీ తృప్తికోసం ఆ పని చేయండి... |

అతను డోర్ మూయటానికి వెళ్లాడు.

డాక్టర్ కూర్చున్నాడు.

అతను వచ్చి టేబుల్ మీదకి వంగాడు...

అను : మీరు ఓ మర్డర్ చేయాలి డాక్టర్...

అప్పుడు కుర్చీని వెనక్కి నెట్టి లేచాడు.

కోపంగా సం : మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలుస్తుందా.... నేను డాక్టర్ని... మీరు నాకు సుపారీ ఇస్తారా... నేను కిరాయి హంతకుడ్ని అనుకుంటున్నారా... సీక్రెట్ అంటే ఇంకేదో అనుకున్నాను. మీరు డోర్స్ ఓపెన్ చేసి గెటవుట్...

అను : నేను కొంచెం టెంక్షన్ లో వున్నాను సర్... ఎలా మొదలు పెట్టాలో నాకు తెలియక పోయి వుండవచ్చు. అంత మాత్రాన నన్ను గెటవుట్ అనొద్దు. ముందు నన్ను వినండి. మీరు ఓ మర్డర్ చెయ్యాలి అన్నాను గానీ చేసి తీరాలి అనలేదు. అసలు ఓ మనిషిని ఇంకొకరు చంపాలి అని సరదాకి అనుకోరు కదా.... మీరు డాక్టర్... అందులోనూ సైకాలజి చదివారు...

సం : అయితే మాత్రం మర్డర్ చేయాలని నన్నే కాదు ఎవర్నీ అడగకూడదు.

జేబులో నుండి 500 నోట్ల కట్ట టేబుల్ మీద పెట్టాడు...

సం : ఇదేంటి అడ్వాన్సా? మర్డర్ డబ్బుతో అవుతుందా?

అను : కాదు. ఇది మర్డర్ కి కాదు. నా గురించి వింటానికి... అంతా విన్నాక మీ డెసిషన్ చెప్పండి.

సం : ముందు ఆ డబ్బు తీసుకోండి. దాన్ని చూస్తుంటే నాకు ఎలర్జీగా వుంది.

తీసుకుని... అను : మిమ్మల్ని డబ్బుతో కొనాలనుకోలేదు డాక్టర్... అయినా ఈ కాలం డాక్టర్లు కిడ్నీలు, గుండె, మరొకటి అమ్మేస్తున్నారని వార్తలు చదువుతున్నాం, టీ.వీ.ల్లో చూస్తున్నాం. నేను ఇలా అడగటానికి కారణం అది. నన్ను మూర్ఖుడు అనుకుంటారో, పేషెంట్ అనుకుంటారో మీ ఇష్టం.

సం : మిమ్మల్ని పేషెంట్ అనే అనుకుంటున్నాను.

అని దగ్గరకు వచ్చాడు... సం : మీ మనసులో ఏదో బాధ వుందని నాకు అర్థం అయింది. సమస్యలన్నీ మర్డర్లతో సాల్వ్ కావు. వాటర్ తాగుతారా...

అను : విషం తాగాలనుంది డాక్టర్...

సం : చూసారా... అయిదు నిముషాల్లో మర్డర్ నుండి సూయ్ సైడ్ కి వచ్చారు. రెండూ సరైనవికావు. నేను కూడా ఆవేశపడ్డాను. మీరు కూర్చొండి. మెల్లగా చెప్పండి...

అను : నేను ఎమోషన్ లో వున్నాను.

అని తలుపు దగ్గరికి వెళ్లి చూసి వచ్చాడు.

అను : బయట ఎవరన్నా వున్నారేమో అని చూసి వచ్చాను.... నా దగ్గర మా నాన్న సంపాదించిన డబ్బు చాలా వుంది. అందులో బ్లాక్ మనీ కూడా వుంది.

సం : కంటిన్యూ చేయండి.

అను : నా కలర్ చూసారు కదా... నలుపు

సం : మరీ అంత నలుపు కాదు.

అను : మా వాళ్ళంతా నల్లోడు అంటారు. మా నాన్న మా వంశం నుండి ఈ నలుపుని పోగొట్టాలని తెల్లటి అమ్మాయిని తీసుకొచ్చి పెళ్ళి చేసాడు. మా ఆవిడ అందగత్తె... అప్పుడు రిస్క్ తీసుకుంటున్నానని నాకు తెలియదు.

సం : ఇందులో రిస్క్ ఏముంది. ఇలాంటి జంటలు చాలా వున్నాయి. తెల్లటి అబ్బాయిలు, నల్లటి అమ్మాయిల్ని చేసుకున్నారు.

అను : బహుశా వాళ్లు పేదవాళ్లు అయి వుంటారు.

సం : మీ శ్రీమతి పేదదా?

అను : లేకపోతే నన్నెందుకు చేసుకుంటుంది. దానికి ఇష్టం లేదు. బలవంతాన చేసుకుంది.

సం : అది మీకు చెప్పిందా... పెళ్లి చూపుల్లో మీరు ఆ అమ్మాయితో రంగు గురించి మాట్లాడారా?

అను : అప్పుడు నేను క్లౌడ్స్ లో వున్నాను. భార్యా రూపవతీ శత్రువు అని నాకు తెలియదు.

సం : మీకు సంతానం వుందా?

అను : పుట్టబోతున్నారని నా అనుమానం. ఇంకా కన్ఫామ్ కాలేదు. ఇంతకు ముందు ఓ సారి అబార్షన్ అయింది. అది నా మిసెస్ చేయించుకుందని నా అనుమానం.

సం : ఎందుకలా అనుకుంటున్నారు?

అను : నాతో పిల్లల్ని కనటం దానికి ఇష్టం లేదు..

సం : చూడండి అనుపమ్... స్వంత భార్యనయినా గౌరవించటం సంస్కారం. దాని, అది, ఇలాంటి మాటలు నా దగ్గర అనవద్దు.

అను : ఓకే....

సం : ఇవన్నీ భ్రమలు అని నేను అంటాను.... మీరు నెగెటివ్ మైండ్ తో వున్నారు. ఈ కాలం పిల్లలు భర్త నచ్చకపోతే విడాకులు

తీసుకుంటున్నారు. అంతే గాని ఓ రూఫ్ కింద వుంటూ హింస పెట్టరు. హింసని అనుభవించరు.

ముందుకు కదిలి... అను : మీ ఫ్యామిలీ ఎంత బాగుంటుందో నాకు అర్థం అయింది. అన్ని కుటుంబాలు మీలా వుండవు డాక్టర్. నా భార్యకి నా డబ్బు కావాలి. నా అంతస్థు కావాలి. నేను మాత్రం అవసరం లేదు.

సం : ఇది మీ పేరెంట్స్ తో మాట్లాడారా?

అను : మహానటి... మా ఆవిడ మహానటి... మా అమ్మ, నాన్నల ముందు ఎంత బాగా నటిస్తుందో... ఇలాంటి కోడల్ని మనం జీవితంలో ఇంకొకర్ని చూడం అనుకుంటారు.

సం : అది నటన అని మీరు అనుకుంటున్నారా?

అను : హండ్రెడ్ పర్సెంట్....

సం : ఇప్పుడు నేను చేయగలిగింది ఒకటే. ఓ సారి మీరూ, మీ శ్రీమతి కలిసి రండి. ఆమె మనసులో ఏముందో నేను మాట్లాడితే తెలుస్తుంది. అప్పుడు, పరిష్కార మార్గం ఆలోచిద్దాం.

అను : మా ఆవిడతో మీరు మాట్లాడతారా!

సం : డాక్టర్ మీద కూడా అనుమానమా...

అను : భగవంతుడు దిగి వచ్చినా అది నిజం చెప్పదు.

సం : మళ్లీ మొదటికొచ్చారు.

అను : దీనికి ఒకటే పరిష్కారం డాక్టర్... అదన్నాచావాలి. నేనన్నా చావాలి.

సం : అయితే మీరు చచ్చిపోండి.

షాకయ్యాడు..

అటూ ఇటూ తిరిగి ఆయన దగ్గరికొచ్చాడు...

అను : నాకు చావంటే భయం.

సం : పోనీ మీ శ్రీమతిని మీరు చంపేయండి. దీనికి డాక్టర్లనో, రౌడీలనో అడగటం ఎందుకు?

అను : అంటే మీకు విషయం అర్థం కాలేదు. నేను చంపితే నాకు ఉరిశిక్ష పడుతుంది. రౌడీలతో అయినా తెలుస్తుంది.

సం : మాట వరసకి నేను చంపాననుకుందాం... నాకు ఉరిశిక్ష పడదా? నీకోసం మా ఫ్యామిలీ నాశనం కావాలా?

అను : డాక్టర్లు తలుచుకుంటే ఏ చట్టానికీ దొరక్కుండా చంపగలరు.

షాకయ్యాడు.... సం : అనుపమ్... వీలయితే రాజీపడు. అయినా ఆ అమ్మాయిని చంపటానికి ఒక్క రీజన్ చెప్పు...

అను : మా ఆవిడ కలల్లోకి పాములు వస్తున్నాయి డాక్టర్....

సం : నీకు రావా?

అను : ఫ్రాయిడ్ ఏం చెప్పాడండి. కలలోకి పాములు రావటం అంటే తీరని సెక్స్ కోరికలకి రూపం అని...

సం : నువ్వు ఫ్రాయిడ్ ని కూడా చదివావా!

అను : మీరు చదవలేదా?

సం : నేను చాలా మందిని చదివాను. నువ్వి ఇన్ని అనుమానాల్తో సంసారం చేయటం మానేసుంటావు. అందుకే కలలో పాములు వస్తున్నాయని అనుకో...

మాట్లాడలేదు... సం : పాము అంటే మన ప్రాణాల్ని తీసేది కాదు. నాగదేవత. దానికి పాలు పోస్తారు. అవి కలలోకి వస్తే శుభం జరుగుతుందని అంటారు. నువ్వు ఫ్రాయిడ్ ని నమ్ముతావా? పాములనా... ఫిలాసఫర్లనా... ఒక్కొక్కరు ఒక్కోరకంగా చెబుతారు.

అను : నేను ఫ్రాయిడ్ ని నమ్ముతాను...

సం : చూడు అనుపమ్... నువ్వు విడాకులు తీసుకో....

అను : మా నాన్న ఆస్తి ఇవ్వడు...

సం : ఈ హత్య జరగటానికి నేను ఒప్పుకోను. నేను పోలీసులకి రిపోర్ట్ యిస్తాను. ఆ అమ్మాయికి ఏదన్నా జరిగితే అది నీ వల్లనే అంటాను. అక్కడితో ఆగను. మహిళా సంఘాలవారి దగ్గర కెళ్తాను. మీ అమ్మా, నాన్నల్ని కలిసి మీ గురించి చెబుతాను....

అను : దానికి సాక్ష్యం వుండాలి కదా...

సం : ఇప్పటి దాకా మన మాటల్ని రికార్డ్ చేసాను.

షాకయ్యాడు...

అంతలో డోర్ బెల్ మోగింది

అను : పోలీసులా?

సం : ఎవరయినా కావచ్చు.

అని వెళ్లాడు.

ఇప్పుడు మొగ్గతో వచ్చాడు.

మొగ్గ : డాక్టర్... మన సెల్ఫీకి ఇప్పటికి మూడు వందల లైకులు వచ్చాయి. నలభై మంది షేర్ చేసారు. ఏభై మంది కామెంట్ చేసారు.

అని అనుపమ్ ని చూసి... మొగ్గ : ఇదేంటి... తలుపులు మూసి వైద్యం చేస్తున్నారు. ఏదో వుంది...

అను : నేనూ, డాక్టర్ ఫ్రెండ్స్... ఏమీ లేదు. మీరు అనవసరంగా డౌట్ పడుతున్నారు.

మొగ్గ : నిజమేనా డాక్టర్....

సం : అవును... ఎమ్.సి.పి.ల గురించి మాట్లాడుకుంటున్నాం. పందులు మొగ్గా... మగ పందులు... అడవి పందులు.... వాటిని ఎలా నిర్మూలించాలి అని ఇతను సలహా అడుగుతున్నాడు.

మొగ్గ : నాకు పెద్ద స్పీచ్ ఇవ్వాలని వుంది. సమయం లేదు. మీరు డేట్ ఫిక్స్ చేయండి. ఇతనికి పెళ్లి అయిందా?

సం : అయింది. అదే బాధ.....

అను : నేను బయలుదేరతాను....

సం : నేను కూడా వస్తాను.

మొగ్గ : నాకు ఇంకా డౌట్ గా వుంది. పెళ్లి అయిందన్నారు. అదే బాధ అంటున్నారు. ఎవరి బాధ... మీకా వీరికా...

సం : అమ్మా మొగ్గా... శ్రీశ్రీ బాధ ప్రపంచపు బాధ... కృష్ణశాస్త్రి బాధ... ప్రపంచానికి బాధ అన్నారు.

మొగ్గ : వాళ్లిద్దరూ ఇప్పుడు ఔట్ డేటెడ్... శ్రీశ్రీ ఆడవాళ్లను తిట్టాడు. కృష్ణశాస్త్రి ఆడవాళ్ళను రొమాంటిక్ గా వర్ణించాడు. అసలు విషయం ఈ కాలపు ఆడవాళ్లు అందరూ ఒకటవుతారు. రేపటి రాజ్యం మాది. వస్తా... ఫిర్ మిలింగే....

అని వెళ్లింది.

అనుపమ్ ముందుకు కదిలాడు...

సం : ఆగు...

అను : తలుపు వేయటానికి వెళ్తున్నాను...

సం : అవసరం లేదు. చూసావుగా... లేడీ పవర్... శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, వీరేశలింగం, గురజాడ... అందరూ ఔట్ డేటెడ్. ఈ అమ్మాయి పేరు మొగ్గ. మీ ఆవిడ దగ్గరికి పంపిస్తే గంటలో నీకు బై చెబుతుంది. నో మర్డర్స్... నో కలర్... నో ఆస్తులు... చివరికి మీ అమ్మా, నాన్నలు కూడా సెపరేట్ అయిపోతారు.

అను : బుద్ధి తక్కువై మీ దగ్గరికి వచ్చాను.

సం : బుద్ధి ఎక్కువయింది అనుపమ్ నీకు... నా దగ్గరకు రాబట్టి బతికిపోయావు. జుట్టుకి రంగేసుకున్నట్లు ఒంటికి రంగేసుకో... సిన్మాలోల్లు ఏసుకోవటం లేదా... అందుకని మర్డర్లు చేయించటమేనా... నీలాంటోల్లందరినీ షూట్ చేసేయాలి రా....

అను : రా.. అంటున్నారేంటి?

సం : రా అనక నిన్ను సార్ అనాలా.... ఒన్ మినిట్ ఆగరా...

అను : ఎందుకు?

సం : సెల్ఫీ తీసుకుందాం...

అని సెల్ కెమెరాలో చూస్తూ... సం : ఛీజ్ అను...

అను : అంటే...

సం : ఔటేడేటెడ్ ఎం.సి.పి. నువ్వు ఫ్రాయిడ్ ని చదివానన్నావు. ఆ మాట అంటే పెదాలు విచ్చుకుంటాయి.

క్లిక్ మనిపించాడు. అను : ఛీ... జ్....

సం : ఇప్పుడు ఈ ఫోటో నా దగ్గర వుంది. ఇందాక చెప్పిన కార్యక్రమం ఈ రోజు నుంచి మొదలు పెడతాను.

అను : మీరు వైద్యం చేసుకోవాలి. ఇలాంటి పనులు మీకెందుకు... ఇదిగో ఈ ఫీజ్ తీసుకుని నన్ను వదిలేయండి.

ఇవ్వబోయాడు. సం : ముందు లోపల పెట్టు. అవి తీసుకుంటే నీలా నేను కలుషితం అయిపోతాను. ఊ...

వెనక్కి తీసుకున్నాడు.... సం : నేను వైద్యం చేసుకోవాలా? నువ్వు మాత్రం నీ పెళ్లాన్ని అనుమానిస్తావా? ఇది బ్లాక్ అన్నావు కదరా... మరి ఆ నోటుకి అన్ని రంగులేంటిరా... నువ్వు కూలిపని చేసి ఒక్క రూపాయి ఫీజ్ ఇవ్వరా... వైట్ ఇవ్వు...

కంగారుగా చూస్తున్నాడు.

హిస్టీరిక్ గా... సం : నేను వైద్యం చేసుకోవాలా? ఆ మాట మొగ్గని అంటావా? నువ్వు కథలు రాసుకోక, కవిత్వం రాసుకోక... నీకు సెల్ ఫోన్లు ఎందుకు? ఫోటోలు ఎందుకు? లివిన్ లు ఎందుకు అంటావా.... అంటే ఏమవుద్దో తెలుసా... అరేయ్ నువ్వు మారవు. మొగ్గ మారదు... ఏంటిరా ఈ హింస... మా కేనా... మా కేనా... ఇంక నువ్వు ఒక్క నిముషం నా ఎదురుగా వుంటే నీ శవంతో సెల్ఫీ తీసుకుంటా... ఫేస్ బుక్ లో పెడతా... ఎన్ని లైకులో, ఎన్ని షేర్లో... వైరల్ అవుద్ది... సమాజానికి వైరల్ ఫీవరొచ్చిందిరా...

అను : డాక్టర్ గారూ... నాకు డౌట్ వస్తోంది. అర్జెంట్ గా మీరు డాక్టర్ ని కలవాలి...

సం : లేడీ డాక్టర్ నా.... విశాఖ వెళ్లనా... ఎర్రగడ్డ వెళ్లనా....

అను : నేను భాగో....

అంటూ పరిగెత్తాడు.

అప్పుడు అటూ ఇటూ పచార్లు చేసాడు.

సెల్ ఫోన్ ని చూసాడు.

టేబుల్ మీద పుస్తకం విసిరి కొట్టాడు.

గోడమీద ఫోటోలను లాగి పారేసాడు.

కుర్చీలో కూర్చున్నాడు...

తల వెనక్కి వాల్చాడు...

కొద్ది క్షణాల తర్వాత లేచి పుస్తకం తీసాడు.

ఫోటో తీసాడు.

స్వగతం : ఇదేంటి... నేను ఇలా అయ్యాను. అనుపమ్ గాడు ఏడి... మొుగ్గ ఏదీ... నారాయణ ఏడి...

అనుకున్నాడు.

ఇంతలో సెల్ ఫోన్ రింగ్ అయింది.

అది ఆన్ చేసాడు...

లక్ష్మి(వా): ఏం చేస్తున్నారు?

సం : అదేనాకు అర్థం అవటం లేదు.

లక్ష్మి(వా): కొత్తగా మాట్లాడుతున్నారేంటి...

సం : ఇప్పుడే మొుగ్గ మళ్లీ వచ్చింది. దానికి ముందు ఇద్దరు నమూనాలు వచ్చారు. అందులో ఒకడు ఎం.సి.పి. ఇంకొకకడు... వాడిని ఎలా వర్ణించాలో నాకు తెలియదు... నాకేంటో పిచ్చి పిచ్చిగా వుంది. నువ్వు అర్జెంట్ గా మన ఆసుపత్రికి రా లక్ష్మి...

లక్ష్మి(వా): ఆ మొుగ్గ గొడవేంటి?

సం : శ్రీశ్రీ, కృష్ణ శాస్త్రి, చలం, మొుత్తంగా రెండు వేల పద్దెనిమిది ముందు వరకూ అందరూ అవుట్ డేటేడ్ అంట...

లక్ష్మి(వా): ఈవిడ మోడ్రనా... పోస్ట్ మోడ్రనా... ఇంతకూ మొుగ్గ దాని పేరు కాదు. అసలు పేరు ఏదో అప్పలమ్మ...

సం : లక్ష్మీ... ఆ పిల్లను అదీ ఇదీ అని నువ్వు సాటి ఆడమనిషిగా అనకూడదు.

లక్ష్మీ(వా): నిన్ను బాగానే భయపెట్టినట్టుందిగా... ఇలాంటి మొగ్గలు చాలా పుడుతున్నాయి. ఇప్పటి వరకు ఏదో రాస్తున్నారు. మాట్లాడుతున్నారు. అని ఊరుకుంటే రెచ్చిపోతున్నారు. ఇప్పుడు అంతర్గత యుద్ధం జరగాలి సంజీవ్...

సం : ఇప్పుడు నాకేం చేయాలో అర్థం కావటం లేదు. నువ్వు అర్జెంట్ గా బయలుదేరిరా లక్ష్మీ...

లక్ష్మీ(వా): వస్తున్నా... అక్కడే వుండు... హాస్పటల్ గది నుండి బయటకి రావద్దు. వచ్చేస్తున్నా... అనవసరపు ఆలోచనలు రానీయకు...

ఫోన్ కట్ చేసాడు.

మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు.

: లైట్స్ ఆఫ్ :

: లైట్స్ ఆన్ :

ఇప్పుడు ఆ గదిలో ఒకే కుర్చీ వుంది.

సంజీవ్ అందులో కూర్చున్నాడు.

టేబుల్:కుర్చీ ఫోటోలు లేవు.

అప్పుడు నారాయణ వచ్చాడు.

నారా : డాక్టర్ గారూ... గదంతా ఖాళీగా వుందేంటి...

సం : గదే కాదు నారాయణా... మనసంతా ఖాళీగానే వుంది. మీ ఊరు నుండి ఎప్పుడు వచ్చావు. నీ కడుపుబ్బరం ఎలా వుంది?

నారా : ఇది పుట్టకతో వచ్చింది. పుడకల వరకు పోదు అంటోందండి మా ఆవిడ.

సం : మీ రహస్యం మీ ఆవిడకు చెప్పారా... ఇంతకీ రవీంద్ర నాలుగు సెంట్ల భూమి ఇస్తానన్నాడా?

నారా : ఆడిస్తానన్నా ఆడి కొడుకు ఒప్పుకోవాలకదండి.

సం : అయితే బతికున్నంత కాలం మీకీ జబ్బు తగ్గదు.

నారా : డాక్టర్లు అలా అనకూడదండి. పోతారని తెలిసినా పోయినా కూడా ఇంకా బతికున్నారని చెప్పాలి. మీరు పెద్ద మనసు చేసుకుని ఏదొకటి ఆలోచించాలి.

అంటుంటే మొగ్గ వచ్చింది....

మొగ్గ : ఓ... ఈ ఓల్డ్ మేన్ ఇంకా వస్తున్నాడా...

నారా : జబ్బు తగ్గేదాకా రావాలికదమ్మా...

సం : నారాయణ గారూ... మీ జబ్బుని తగ్గించగలిగేది మొగ్గ గారే...

మొగ్గ : లక్ష్మి అంటే మీ శ్రీమతే కదా...

సం : అవునండి....

మొగ్గ : మాలో మాకు చీలికలు పెడతారా.... మీరు మాతో యుద్ధం చేయలేక ఆమెని వదిలారా...

సం : నాకేం అర్థం కావటం లేదు...

మొగ్గ : ఇప్పుడు లక్ష్మి నా మీద యుద్ధం మొదలు పెట్టింది. నాకు కీర్తి కాంక్ష అంట. పూల దగ్గర్నుంచి కుష్టు దాకా అన్నీ ఎంజాయ్ చేస్తానంట.

నారా : కుష్టుని ఎంజాయ్ చేయటం ఏంటి మొగ్గా?

మొగ్గ : మీరు ప్రశ్నలు అడగొద్దు. వినండి. ఆకాశం నుండి భూమిని, పాతాళాన్ని, సముద్రాల్ని, పర్వతాల్ని ఏదీ వదలనంట...

సం : మా ఆవిడా ఫెమినిస్టే....

మొగ్గ : ఫెమినిస్టులంతా ఒకటి కాదు. లక్ష్మి ఫెమినిస్ట్ రూపంలో వున్న మగాడు. మధ్య యుగాల్లో పుట్టిన మెదడుతో వుంది. మా స్వేచ్ఛను భరించలేక పోతుంది. నేను సెల్ఫీ పెట్టినా, ఫోటో పెట్టినా, నెగెటివ్ గా కమెంట్ చేస్తోంది.

నారా : రెండు కొప్పులు ఓ చోట కలవవు అంటారు మొగ్గమ్మాయి.

మొగ్గ : రెండు క్రాపులు కలుస్తాయా నారాయణా...

అని.... మొగ్గ : ఈయనకి నేను వైద్యం చేయటం ఏంటి?

సం : నేను వైద్యం మానేసాను కాబట్టి... నాకంటే మీరు మోడ్రన్ కాబట్టి... అయినా లక్ష్మి అభిప్రాయాలతో నాకు సంబంధం లేదు. ఈ రోజే మా క్లినిక్ క్లోజ్....

మొగ్గ : తర్వాతేం చేస్తారు... మీరు లక్ష్మితో జాయిన్ అవుతారా?

సం : నేను ఎవరితోనూ జాయిన్ అవను. ఇప్పుడు నాకు ప్రశాంతంగా వుంది. ఈ ప్రపంచం గురించి పట్టించుకోను. నేను ఏ రోగాలూ నయం చేయను. ఎవరికీ కౌన్సిలింగ్ ఇవ్వను.

నారా : ఇది అన్యాయం... పిచ్చి నిర్ణయం... నారాయణ...

సం : ఈ ప్రపంచంలో అడుగడుగున అన్యాయాలున్నాయి. నాది పిచ్చే. మీ అందరూ మేధావులు. నేను అందుకే దూరంగా వుంటాను. మీరు సమాజాన్ని మార్చితే మార్చండి. మీరు మారండి. మీ సమస్యలు మీకు తెలుసు. కొత్త శత్రువులను తయారు చేసుకోవద్దు. నిన్నటి వాళ్లని ఈ

రోజు అంటున్నారు. రేపు మిమ్మల్ని వచ్చే తరం అంటుంది. ఈ పతనాన్ని, ఈ సకల బలహీనతల్ని... ఈ అహంకారాల్ని... ఈ భ్రమల్ని ఎవరూ మార్చలేరు. ఇదిట్లా నడుస్తూనే వుంటుంది. ఇది నా చివరి ప్రకటన. ఇంకా మీరు వెళ్లండి.

నారా : మనిషికి సత్తువయిపోయినప్పుడు, కదలకుండా పడున్నప్పుడు గ్యానం వస్తుందంట. డాక్టరు గారికి మధ్యలో వచ్చింది. అమ్మాయి మొగ్గా... నేనూ మగాడ్నే... అయినా ఓ ముక్క సెబుతా... మనిసన్నాక అది ఆడైనా... మగైనా... రెండు కానోల్లయినా, సగం సగం అయినా తోడుండాలె. దానికేం పేరెడతావో నాకు తెలవదు. నువ్వేం చేస్తే నీకు సుకం కలుగుద్దో ఆ పని సెయ్యి. ఇంక బయలుదేరదాం. రెండు చాయ్ లు తాగుదాం....

మొగ్గ : మీరు చాలా గొప్పగా మాట్లాడననుకుంటున్నారు. మీ మాటల్ని నేను, మా బృందం స్కాన్ చేస్తాం. మీ గుట్టు బయట పెడతాం. రేపటి రాజ్యం మా ఆడవాళ్లదే...

సం : సంతోషంగా ఆ పని చేయండి.

నారా : గుట్టు బయటపెడతావా... ఎవరిది... బయట పెట్టాల్సింది డాక్టర్ గారి గుట్టు కాదు. గట్టు మీద నిలబడి మాట్లాడటం కాదు... నాకయితే బుద్ధి వచ్చింది. నీకు రావల... వస్తుంది... నీకు బుద్ధే కాదు. తోడు వస్తుంది. నేను వోల్డు మేన్ ని కాబట్టి చివరి మాట చెబుతున్నా... నీలాంటోల్లను శాన మందిని చూసా... నువ్వు నన్ను మగ పందని తిట్టినా ఐ డోంట్ కేరు... వస్తా డాక్టర్ గారు... మీ మనసు మారితే మా బామ్మర్దికి కబురు సెయ్యండి...

అని వెళ్లాడు....

సం : మొగ్గగారూ... మీరు వెళ్తే నేను కూడా క్లోజ్ చేసి వెళ్తాను...

మొగ్గ : మీరు క్లోజ్ చేయవచ్చు. నేను నా పోరాటాన్ని మాత్రం క్లోజ్ చేయను.

సం : సంతోషం... ఆన్ లైన్ వున్నంతవరకు మీ పోరాటం వర్ధిల్లాలి....

మొగ్ధ విసురుగా వెళ్లింది...

సంజీవ్ ఫోన్ చేసాడు.

సం : లక్ష్మీ... ఈ రోజుతో నాకూ హాస్పటల్ కి సంబంధం తెగిపోయింది. నాలాంటి బలహీనులు వైద్యానికి పనికిరారు. ఇప్పుడు మొగ్గ వచ్చింది.

లక్ష్మి(వా): ఉంటే... ఒ సారి తనకి ఫోన్ ఇవ్వు సంజీవ్...

సం : నీతోనూ, నాతోనూ, మగ ప్రపంచంతోనూ పోరాటం ఆపనని శపథం చేసి వెళ్లింది.

లక్ష్మి(వా): ముందు ఆవిడ మీద ఆవిడ పోరాటం చేసుకోనీయండి. ఎక్కడ మొదలై ఎక్కడికి ప్రవహించిందో వెనక్కి తిరిగి చూసుకోమనండి. ఆవిడే కాదు. పోరాటం ఆపని వాళ్లు చాలా మందున్నారు.

సం : నువ్వు వస్తే చివరి సారి మన గదిని చూద్దువు గాని...

లక్ష్మి(వా): కమింగ్ సంజీవ్....

ఫోన్ కట్ చేసాడు.

అప్పుడు అనుపమ్ వచ్చాడు.

అను : ఇదేంటి డాక్టర్... అన్నీ మాయం అయ్యాయి.

సం : వేకేట్ చేస్తున్నా..

అను : ఏ ఏరియాలో పెడుతున్నారు?

సం : టోటల్ గా ఈ వైద్యం బంద్ చేస్తున్నా...

అను : మరి ఖర్చులు...

సం : వైద్యం చేస్తేనే బతకగలమా....

అను : నన్ను క్షమించండి... మీరు ఇలాంటి నిర్ణయం తీసుకుంటానికి నేనూ ఓ కారణం కావచ్చు. ఇప్పుడు నాకు నా భార్యని మర్డర్ చేయాలని లేదు. అలాగే నేను చావాలనుకోవటం లేదు. ఇప్పుడైనా మీరు ఫీజ్ తీసుకుంటే సంతోషం...

సం : చివరి జ్ఞాపకం ఇదే అనుపమ్... కనీసం నువ్వన్నామారావు. మామూలుగా రచయితలు అంటారు. ఒక్కరు నా రచన చదివి మారినా చాలని... అందుకని ఈ ఫీజు తీసుకుంటే నాకు తృప్తి ఉండదు. ఇప్పుడు ఈ హాస్పటల్ శాశ్వతంగా మూతపడింది.

**: సమాప్తం :**